క్లుప్తంగా

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన



పాన్‌గల్: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధిస్తూ సామర్థ్యాలను పెంచాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ జయశంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని మాధరావుపల్లి, శాగాపూర్, కదిరెపాడు ప్రాథమిక పాఠశాలలను ఆయన ప్రార్థన సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం, తొలిమెట్టులో భాగంగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, మెనూ ప్రకారం నాణ్యతగా మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు.

నట్టల నివారణ మందుల పంపిణీ



వనపర్తి రూరల్: పశువైద్యశాఖ ఆధ్వర్యంలో శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురంలో పశువులకు పశువైద్యాధికారి స్వాతి మంగళవారం 15 పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. గ్రామంలో 21 ఆవులు, 45 గేదెలకు గర్భకోశ చికిత్స చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆంజనేయులు, జూనియర్ వైద్య అధికారులు హబీబ్, లలిత, గోపాలమిత్ర గోవింద్, సురేష్, పాడిరైతులు పాల్గొన్నారు.

రాకపోకలకు అంతరాయం



వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలో సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి పెబ్బేరు, వెంకటాపురం మధ్య వాగు ప్రమాద స్థాయిలో ప్రవహించింది. దీంతో బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం అధికారులు కొల్లాపూర్ నుంచి వచ్చే వాహనాలను శ్రీరంగాపురం మీదుగా, పెబ్బేరు నుంచి వెళ్లే వాహనాలను కంచిరావుపల్లి మీదుగా మళ్లించారు.


చిన్నారి మృత్యువాత



హరిత (ఫైల్)

గోపాల్‌పేట: ఏదుల మండల కేంద్రానికి చెందిన ఓ చిన్నారి కాలేయ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మరణించింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఏదులకు చెందిన కుందేళ్ల రాము, గౌరి కుమార్తె హరిత(11) జ్వరంతో బాధపడుతుండటంతో తల్లిదండ్రులు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి చిన్నారిని గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు కాలేయానికి పసిరికలు సోకి పూర్తిగా చెడిపోయిందని, కాలేయం మార్చడానికి రూ. 35 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. దాతల నుంచి రూ.30 లక్షలు పోగుచేసి ఆస్పత్రిలో కట్టారు. అనంతరం తల్లి కాలేయంలో కొంతభాగాన్ని హరిత అమర్చారు. ఈ క్రమంలో మరోసారి పసిరికలు ఎక్కువ కావడంతో గుండెనొప్పితో సోమవారం హరిత మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఏర్పాట్ల పరిశీలన



కొత్తకోట: కొత్తకోట మండలంలోని కానాయపల్లి శంకర సముద్రం, ఆర్అండ్ ఆర్ ప్యాకేజీకి సంబంధించిన పనులను పరిశీలించేందుకు బుధవారం రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు రానున్నట్లు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంత్రుల రాక సందర్భంగా ఎమ్మెల్యే ఇరిగేషన్ శాఖ అధికారులతో పర్యటనకు సంబంధించిన వివరాలను, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు.

పొగాకుతో ప్రాణాలకే ప్రమాదం



ఖిల్లాఘనపురం బాలుర ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నర్సింహులు



వీపనగండ్లలో..

ఖిల్లాఘనపురం: పొగాకు వాడకం వలన సమాజంలో ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారని మండల వైద్యాధికారి డాక్టర్ నర్సింహులు, బాలుర ఉన్నత పాఠశాల జీహెచ్ఎం కాళిదాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ పొగాకు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ పొగాకు నేరుగా లేదా బీడీ, చుట్ట ద్వారా అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. పొగ తాగే వారికి దూరంగా ఉండాలని, వారి వల్ల కూడా పక్కవారికి ప్రమాదమన్నారు. విద్యార్థులు తమ ఇళ్ల చుట్టు పక్కల పొగాకు అలవాటు ఉన్నవారికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు విజయ, శంకరమ్మ, ఆశా కార్యకర్తలు సరళ, తార, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, పీఈటీ దేవేందర్, ఎంఆర్సీ సిబ్బంది అర్జున్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో ఆరోగ్య సమస్యలు

వీపనగండ్ల: పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు తమ ఆరోగ్య పరిరక్షణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పొగాకు, మాదకద్రవ్యాలు తీసుకోవడంపై పలు అనర్థాలు చోటు చేసుకుంటాయని మండల వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. మంగళవారం కల్వరాల గ్రామంలో స్థానిక ఆరోగ్య ఉప కేంద్రం ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల అంటు వ్యాధుల బారిన పడే అవకాశాలు తక్కువని వివరించారు.

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో పొగాకు నియంత్రణపై గ్రామస్తులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ తారాశశాంక్ మాట్లాడుతూ.. పొగాకు తినడం, ధూమపానం (సిగిరెట్లు, బీడీలు, గుట్కా, పాన్ మసాలా) వల్ల క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఊపిరితిత్తులు చెడిపోయి టీబీ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజలను చైతన్యం చేస్తూ పొగాకు రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుమనశ్రీ, రాంచందర్, మదన్‌గోపాల్, శ్రీలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పరశురాములు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పాన్‌గల్ మండలం కేతేపల్లిలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



పాన్‌గల్‌లో స్కీం బోరు పరిసరాలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ ఉమాదేవి



అమరచింతలో..

పాన్‌గల్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండవచ్చని డీఆర్‌డీఓ ఉమాదేవి అన్నారు. డ్రైడేలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో పర్యటించి తాగునీటి ట్యాంకు, స్కీం బోరు పరిసరాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పారిశుద్ధ్య నివారణ కోసమే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పారిశుద్ధ్య నివారణ, వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, ఇంకుడుగుంతల నిర్మాణం, తడి, పొడి చెత్త వేరు చేయడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ స్వచ్ఛ గ్రామాలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవిందరావు, ఎంపీఓ రఘురాములు, ఏపీఎం సక్రూనాయక్, పంచాయతీ కార్యదర్శి నరేష్‌గౌడ్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నివారణకు..

ఆత్మకూర్: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. మంగళవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు.

మున్సిపాలిటీ కేంద్రంలో..

పట్టణంలోని 1వ వార్డులో కౌన్సిలర్ చెన్నయ్య ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు తదితరులు ఉన్నారు.

అమరచింత: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సింగంపేటలో చేపడుతున్న స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల దవఖానా ఆధ్వర్యంలో..

ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం బీడీ కార్మికుల దవఖానా ఆధ్వర్యంలో వైద్యులు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దవఖానాలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రమేష్‌గౌడ్, డాక్టర్ అనిత పాల్గొని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణంతో పాటు పరిసరాల్లోని పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో డ్రైవర్ భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

కొత్తకోట రూరల్: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న బీసీ కుల గణన మార్చ్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆ సంఘం నాయకులు మంగళవారం కొత్తకోటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భీమన్ననాయుడు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 10నెలలు కావస్తున్నా నేటికీ కులగణన చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తీరును నిరసిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సుందరయ్య పార్క్ నుంచి ఇందిరా పార్క్ వరకు చేపడుతున్న మహార్యాలీకి జిల్లాలోని బీసీ పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. కార్యక్రమంలో బీసీ యువజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్, తిరుపతయ్యగౌడ్, నరేందర్‌గౌడ్, శరత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

వనపర్తి రూరల్: గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదుకు అపూర్వ స్పందన వస్తుందని జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లిలో చేపడుతున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయనతో పాటు జిల్లా నాయకుడు పురుషోత్తంరెడ్డి హాజరయ్యారు. ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వెంకటస్వామి, ఎల్లస్వామియాదవ్, సురేష్ యాదవ్, రాజేష్, మేకల రాముడు, గుంటి శివ, కార్తీక్, ఎల్లస్వామి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురం: దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని వనపర్తి నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని వెనికితండాలో బీజేపీ సభ్యత్వ కార్యక్రమాన్ని మండల శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రవినాయక్, మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కేశన్న, రాములు, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సవారమ్మ ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఖిల్లాఘనపురం: మండలంలోని ఉప్పరిపల్లిలో సవరమ్మ, సరస్వతమ్మ, మారెమ్మ, కర్రెమ్మ దేవతల ఉత్సవాలను మంగళవారం కనులపండువగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఉదయం నుంచి ఆలయం వద్ద అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారి కోసం పసుపు, కుంకుమ, పూలు, గంధం తదితర వాటితో అందంగా అలంకరించిన బోనాలలో ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని తీసుకుని ఊరేగింపుగా వీధుల గుండా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం చుట్టు ప్రదక్షణలు చేసి నైవేద్యాన్ని అమ్మవారికి అర్పించారు. కొందరు కోళ్లు, పొటేళ్లను కోసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఉత్సవాలకు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థి మహాగర్జనను జయప్రదం చేద్దాం

కొత్తకోట రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 27న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టే 'విద్యార్థి మహాగర్జన' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆది పిలుపునిచ్చారు. విద్యార్థి మహాగర్జనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం పట్టణ కేంద్రంలోని నివేదిత డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఆత్మకూర్: విద్యాశాఖలో భాగమైన సమగ్రశిక్షా ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న కేజీబీవీ, యూఆర్ఎస్, సీఆర్పీ, ఐఈఆర్పీ, ఎంఐఎస్, సీసీఓలను ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని మంగళవారం రాత్రి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణకు కాంట్రాక్టు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సౌమ్యరాణి, సమి, బాలకృష్ణ, వెంకట్, పరమేష్, శ్రీను, లక్ష్మి తదితరులు ఉన్నారు.

ఆగిందంటే.. తోయాల్సిందే..



వనపర్తి: ఆర్టీసీ బస్సు అంటే 'టైం కు రాదు.. వస్తే పోదు' అనే పాత నానుడి ప్రస్తుత వనపర్తి డిపో బస్సులకు సరిగ్గా సరిపోతుంది. కాలం చెల్లిన బస్సులతో పూట గడిపిస్తుండడంతో అవి రోజుకోమారు మొరాయిస్తున్నాయి. దీంతో డ్రైవర్, కండక్టర్ల తిప్పలు వర్ణణాతీతం. మంగళవారం కొత్తకోట బస్టాండ్‌లో చర్లపల్లికి వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సు స్టార్ట్ అయ్యేందుకు మొరాయించింది. దీంతో అక్కడే ఉన్న విద్యార్థులు తోయడంతో బస్సు స్టార్ట్ కావడంతో చర్లపల్లికి బయలుదేరింది.

ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వర్‌రావు

పాన్‌గల్: ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థిగా ఉంటూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని పాఠశాల, ఇంటర్, డిగ్రీ స్థాయిలో రసాయన శాస్త్ర పుస్తక రచయిత, ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ సబ్జెక్ట్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సబ్జెక్టుల్లో వస్తున్న మార్పుల్ని, రసాయన శాస్త్ర పరిశోధనల్ని వాటి చరిత్రను, సమాజంలో నేటి సైన్స్ మనుగడను వివరించి పలు సూచనలు, సలహాలను ఉపాధ్యాయులకు సూచించారు.

ఘన సన్మానం

కాంప్లెక్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్‌ను మండల నోడల్ ఆఫీసర్, పాఠశాల జీహెచ్ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూల బొకేను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాన్‌గల్ కాంప్లెక్స్ హెచ్ఎం నరేందర్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, ఆర్పీ శ్రీనివాసులు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న విజ్ఞాన దర్శిని రాష్ట్ర నాయకుడు ఆదాంరాజు

పాన్‌గల్: మూఢనమ్మకాల నిర్మూలనపై ప్రజలను చైతన్యం చేయడంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని విజ్ఞానదర్శిని రాష్ట్ర నాయకుడు బొల్లి ఆదాంరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా నిర్వహించిన మూఢనమ్మకాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి కంప్యూటర్ యుగంలో కూడా చాలామంది మూఢనమ్మకాలను నమ్ముతున్నారని, వాటిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించి ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. మూఢనమ్మకాలతో నష్టాలు, కష్టాలను వివరిస్తూ మంత్రాలు, చేతబడుల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న తీరును విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధించాలన్నారు. సమావేశంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: విద్యార్థులు మూఢనమ్మకాలను విడనాడి, చదువుపై శ్రద్ధ పెడితే ఉన్నతంగా రాణించగలుగుతారని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర సభ్యుడు కోయ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం తూంకుంట జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఇటీవల క్షుద్ర పూజలు జరిపారన్న అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కంప్యూటర్ యుగంలో మూఢనమ్మకాలను విశ్వసించరాదని, ఇలాంటి ఘటనలతో మానసిక ధైర్యాన్ని కోల్పోరాదని ఆయన విద్యార్థులకు సూచించారు. క్షుద్రపూజల పేరుతో విద్యార్థుల మనోధైర్యాన్ని దెబ్బతీయాలని చూసేవారిని గ్రామస్తులు, పోలీసులు గుర్తించి చట్టపరంగా శిక్షలు పడేవిధంగా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు జితేందర్‌గౌడ్, పి వెంకటరమణ, రాష్ట్ర కార్యదర్శి రవి, జిల్లా కార్యదర్శి నాగశేషి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవాల మేతకు అటవీ భూములు కేటాయించాలి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న గొర్రెల పెంపకందార్ల సంఘం నాయకులు

పాన్‌గల్: జీవాల మేతకు అటవీ భూములు కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్, శాగాపూర్ గ్రామ గొర్రెల పెంపకందార్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలా గ్రామాల్లో సాగునీటి కాల్వలు ఉండటంతో గొర్రెలు, మేకలకు మేత లభించక ఇబ్బందిగా ఉందన్నారు. ఎక్కడ కూడా బీడు భూములు లేకపోవడంతో గొర్రెల కాపారులు జీవాల మేతకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ భూముల్లో జీవాలను మేపుకునేందుకు అవకాశం కల్పించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో మండల గొర్రెల పెంపకం దార్ల సంఘం నాయకులు పెద్దబాలరాజు, సుబ్బయ్య, రాము, కొమ్ము రాములు, ఆకునమోని రాములు తదితరులు పాల్గొన్నారు.

ఒక గది.. రెండు అంగన్‌వాడీ కేంద్రాలు



తూంకుంటలో ఒకే గదిలో కొనసాగుతున్న రెండు అంగన్‌వాడీ కేంద్రాలు

వీపనగండ్ల: మండలంలోని తూంకుంటలో ఒక గదిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని 2, 3వ అంగన్‌వాడీ కేంద్రాల్లో దాదాపు 20 మంది చిన్నారులతో పాటు మరో 20 మంది బాలింతలు, గర్భిణులు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రానికి వస్తుంటారు. ఇరుకైన గదిలో 2 అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల కేంద్రానికి సంబంధించిన ముడిసరుకులు, బీరువాలను భద్రపరుచుకోవడం ఇబ్బందవుతుందని అంగన్‌వాడీ టీచర్లు పారిజాత, లక్ష్మి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలను నిర్మించాలని అధికారులకు పలుమార్లు విన్నవించామని గ్రామస్తులు తెలిపారు. కాగా ఇలాంటి అంగన్‌వాడీ కేంద్రాలు మండలంలో మరికొన్ని ఉన్నాయని, వాటిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు సమస్యలను గురించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే తమపై పని ఒత్తిడిని పెంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కేంద్రాల్లో వసతులు లేకున్నా తప్పనిసరి పరిస్థితుల్లో కేంద్రాలను నడుపుతున్నట్లు పలువురు అంగన్‌వాడీ టీచర్లు వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు వెంటనే నిధులు మంజూరు చేయించి నూతన భవనాలను నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

క్షుద్ర పూజలపై పోలీసులకు ఫిర్యాదు



తూంకుంట జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో క్షుద్రపూజల కోసం వేసిన ముగ్గు

వీపనగండ్ల: మండలంలోని తూంకుంట జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు రెండు రోజుల క్రితం క్షుద్రపూజలు నిర్వహించారని, ఘటనపై విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి వహీద్ మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల ఆవరణలోకి వచ్చి పాఠశాలకు వెళ్లే ప్రధాన గేటు వద్ద ముగ్గుతో బొమ్మలు వేసి నిమ్మకాయలు, కల్లు సీసాను ఉంచారన్నారు. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారని, గతంలో కూడా ఈ పాఠశాల ఆవరణలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయని, మూఢనమ్మకాలతో విద్యార్థులను భయాందోళనకు గురిచేయాలని చూస్తున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

మద్యం దుకాణం తరలించాలని ధర్నా



ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

అమరచింత: పట్టణంలోని మరికల్-ఆత్మకూర్ ప్రధాన రహదారి పక్కన ఉన్న వైన్‌షాప్‌ను తరలించాలంటూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ ప్రధాన రహదారి పక్కన వైన్‌షాప్ ఉండటంతో నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే పెట్రోల్ బంక్, చికెన్, మటన్, చేపల దుకాణాలు ఏర్పడటంతో నిత్యం వైన్‌షాప్ పరిసరాలు రద్దీ ఏర్పడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రమేష్‌రెడ్డికి అందించారు. కార్యక్రమంలో విజయ్, అరుణ్, నేపోల్, వినోద్, మహమూద్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.